ఎమ్మెల్యే సత్యం కుటుంబానికి కేటీఆర్ పరామర్శ


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పిల్లలను ఓదార్చుతున్న కేటీఆర్

మచ్చబొల్లారం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబాన్ని అల్వాల్ సర్కిల్ పంచశీలకాలనీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యేకు ఆయన పిల్లలకు ధైర్యం చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. చిన్న వయసులో కుటుంబానికి తీరని లోటు జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నగరానికి విదేశీ మీడియా ప్రతినిధుల రాక

● పర్యాటక కేంద్రాల సందర్శన


గోల్కొండకోటలో విదేశీ మీడియా ప్రతినిధులతో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన పలు ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు హైదరాబాద్‌కు చేరుకున్న విదేశీ మీడియా ప్రతినిధులకు శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సమాచార-పౌరసంబంధాల శాఖ, ప్రొటోకాల్ విభాగం అధికారులు ఘన స్వాగతం పలికారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీదౌత్యవ్యవహారాల విభాగం అధికారుల పర్యవేక్షణలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలను విదేశీ మీడియా ప్రతినిధులు సందర్శించనున్నారు. నాలుగు రోజుల తెలంగాణ పర్యటనలో భాగంగా బుధవారం గోల్కొండ కోటను సందర్శించారు. ఆషాడ బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు గోల్కొండ కోట జగదాంబిక ఆలయానికి వెళ్లిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విదేశీ మీడియా ప్రతినిధులకు స్వాగతం పలికారు. గోల్కొండ కోట చరిత్ర, కులీకుతుబ్‌షాల పాలన, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతియేటా ఆషాడమాసంలో నిర్వహించే బోనాల వేడుకల ప్రాశస్త్యాన్ని వారికి వివరించారు. అనంతరం విదేశీ మీడియా ప్రతినిధుల బృందం శిల్పారామంను సందర్శించింది. అక్కడ తెలంగాణ హస్త కళాకారుల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రితిక, తనిష్కలు ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది.

ఇంగ్లిష్ ఛానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ

● గంధం క్వీణి విక్టోరియా రికార్డు


గంధం క్వీణి విక్టోరియా(సర్కిల్‌లో)

బర్కత్‌పుర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంధం క్వీణివిక్టోరియా ప్రపంచమంతా స్విమ్ ఎవరెస్ట్‌గా పిలుచుకునే ఇంగ్లిష్ ఛానెల్‌ను 44 ఏళ్ల వయస్సులో ఈదిన తొలి తెలుగు మహిళగా రికార్డు నెలకొల్పారు. ఈ నెల 24న బ్రిటీష్ కాలమానం ప్రకారం రాత్రి 10 గంటల 46 నిమిషాలకు ఇంగ్లాండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి 25న సాయంత్రం 4 గంటల 16 నిమిషాలకు ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచి కోస్ట్‌కు చేరుకుంది. ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఉన్న ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఇంగ్లిష్ ఛానెల్‌గా పిలుస్తారు. ఈ రెండు దేశాల మధ్య దూరం 36 కిలోమీటర్లు. రాత్రి వేళల్లో అలల తాకిడి అధికంగా ఉండడం వల్ల 71 కిలోమీటర్ల మేర క్రాస్ స్విమ్మింగ్ చేసి 16 గంటల 50 నిమిషాలలో ఇంగ్లిష్ ఛానెల్‌ను ఒక వైపు ఈదడం జరిగిందని గంధం క్వీణివిక్టోరియా తెలిపారు. 8 మంది బృందంతో కలిసి ఇంగ్లండ్‌కు వెళ్లానని చెప్పారు. బ్లూడాల్ఫింగ్ స్విమ్మింగ్ క్లబ్‌లో కోచ్‌లు దినేష్ రాజోరియా, రాధికమండవ వద్ద శిక్షణ పొందిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన విక్టోరియా బర్కత్‌పురలో ఉంటున్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సతీష్ మట్ట బుధవారం విక్టోరియాను అభినందించారు.

కేడర్ ప్రాసిక్యూటర్ల ప్రమోషన్లపై అసత్య ప్రచారం

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేడర్ ప్రాసిక్యూటర్ల ప్రమోషన్‌లతో న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(కేడర్) అసోసియేషన్ ఖండించింది. రాష్ట్రంలోని 220 సెషన్ కోర్టుల్లో న్యాయవాదుల నుంచి టెన్యూర్ పీపీలుగా ఎన్నుకోబడిన 108 మంది వివిధ కోర్టుల్లో పనిచేస్తుండగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఉద్యోగం పొంది ప్రమోషన్‌ల ద్వారా సెషన్ కోర్టుల్లో పీపీలుగా పనిచేస్తున్న వారు 42 మంది ఉన్నారని, కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేడర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శైలజ. జనరల్ సెక్రటరీ కె.నరేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ అయిన ఏపీపీ పోస్టుల్లో యువ న్యాయవాదులకు అవకాశాలు వస్తాయని వారు తెలిపారు.

9న అయోధ్య, కాశీ సహ ఐదు పుణ్యక్షేత్రాలకు రైలు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్య, కాశీ సహా ఐదు పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఐఆర్‌సీటీసీ తొమ్మిది రోజుల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. జూలై 9న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి భారత్‌గౌరవ్ టూరిస్ట్ అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. గయ, వారణాసి, సారనాథ్, అయోధ్య, ప్రయాగరాజ్‌లను సందర్శించే పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్టు వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9281495843, 9281495845లో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు తెలిపారు.

నిమ్స్‌లో పూర్తిస్థాయి చికిత్సలు అందిస్తున్నాం: బీరప్ప

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో దుప్పట్ల కొరత కారణంగా గ్రామాల నుంచి వచ్చిన వారిని చేర్చుకోవడం లేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న కథనం పూర్తిగా అవాస్తమని నిమ్స్ డైరెక్టర్ ప్రొ.బీరప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర సేవల విభాగం, ఔట్‌పేషంట్ల విభాగంలో రోగులను చేర్చుకుంటూ పూర్తిస్థాయిలో చికిత్సలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్ని విభాగాల అడ్మిషన్ జాబితాను విడుదల చేశారు.

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి

● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

● రెండు కార్లు, 280 కిలోల సరుకు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు సభ్యులను ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర షోలాపూర్ బ్రహ్మపురి గ్రామానికి చెందిన బోంస్లే ఆబా మచ్చీంద్ర అలియాస్ అబా (29), షోలాపూర్ సౌత్‌కు చెందిన అవినాష్ శివాజీ రాథోడ్(19), షోలాపూర్ సౌత్ పాషానగర్‌కు చెందిన సిద్ధరామేశ్వర్ పూజారి అలియాస్ సిద్ధూ(27) స్నేహితులు. 10వ తరగతి వరకు చదువుకుని డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరికి షోలాపూర్‌కు చెందిన గంజాయి విక్రేత అజయ్ రాథోడ్‌తో పరిచయం ఏర్పడింది. అజయ్ డబ్బు, వాహనాలు సమకూర్చితే ఈ ముగ్గురు ఒడిశా అలూరి కోటకు చెందిన తేజ నుంచి గంజాయి కొనుగోలు చేసి షోలాపూర్‌కు తీసుకొచ్చి అధిక ధరకు విక్రయిస్తున్నారు. గంజాయి కొనుగోలు చేసేందుకు అజయ్ రాథోడ్ డబ్బులు, కార్లు (స్విఫ్ట్ డిజైర్, ఇన్నోవా) సమకూర్చాడు. రెండు కార్లలో ఒడిశా వెళ్లిన ముగ్గురు నిందితులు 280 కిలోల గంజాయిని తీసుకొని విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా షోలాపూర్ వెళ్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు పంతంగి టోల్‌గేట్ వద్ద కార్లను తనిఖీ చేశారు. రెండు కార్లు, 280 కిలోల గంజాయి, మూడు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పొంగుతున్న డ్రైనేజీలు..

కంపుకొడుతున్న కాలనీలు


ఎన్జీవోస్‌కాలనీ ఎయిట్ వీ రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

● నదులను తలపిస్తున్న కాలనీల రోడ్లు
● తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
● వర్షం పడుతున్న ప్రతిసారీ తప్పని తిప్పలు


వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ

వనస్థలిపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వర్షం పడిన ప్రతిసారి వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లన్నీ మురుగునీరుతో జలమయం కావడంతో కాలనీల్లోని రోడ్లు నదులను తలపిస్తున్నాయి. దీంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లడంతో కాలనీవాసులు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్‌కాలనీ ఎయిట్ వీ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం డ్రైనేజీ పొంగడంతో ఆ రోడ్డు పూర్తిగా మురుగునీరుతో జలమయం అవుతుంది. దీంతో అటుగా వెళ్లాలంటేనే కాలనీవాసులు, విద్యార్థులు, వయోవృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఎన్జీవోస్ కాలనీలోని చర్చి సమీపంలోని కాలనీల్లో సైతం ఇదే విధమైన డ్రైనేజీ సమస్య తలెత్తడంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంబంధిత అధికారులు తమ సిబ్బందితో వచ్చి డ్రైనేజీ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడంతో ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి పై కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ మురుగుతో తమ కాలనీలోని మ్యాన్‌హోళ్లు తెరుచుకుని డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వైదేహినగర్, ఎఫ్‌సీఐ కాలనీ, మల్లికార్జుననగర్, చింతలకుంట, కమలానగర్, శారదానగర్, బతుకమ్మకుంట, గౌతమినగర్, బీఎన్‌రెడ్డి నగర్, సాహెబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపైకి రావడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైకి వచ్చే మురుగునీరుతో వాహనదారులు కొన్ని సందర్భాల్లో కిందపడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయని కాలనీవాసులు తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు నూతన డ్రైనేజీ పైప్‌లను వేసి డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


వైదేహినగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

వరదనీటి పైప్‌లైన్లను కలపడంతోనే డ్రైనేజీ సమస్యలు



జీహెచ్ఎంసీ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కాలనీలోని డ్రైనేజీ పెప్‌లైన్‌లలో వరదనీటి పైప్‌లైన్లు కలపడంతోనే డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. కాలనీవాసులకు డ్రైనేజీ సమస్యలు రాకుండా తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు డ్రైనేజీలను పర్యవేక్షిస్తున్నాం. బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, మన్సూరాబాద్ తదితర ప్రాంతాల్లో వరదనీరు వెళ్లడానికి డ్రైనేజీ పైప్‌లైన్‌లలో కలపడంతోనే డ్రైనేజీలు పొంగుతున్నాయి. త్వరలోనే ప్రజలకు డ్రైనేజీ సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం.

\- దేవరం శ్రీనివాస్‌రెడ్డి, జీఎం, జలమండలి జీఎం

నూతన డ్రైనేజీ పనులు చేపట్టాలి



వర్షం పడిన ప్రతిసారి పొంగుతున్న డ్రైనేజీతో కాలనీవాసులందరం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. గతంలో వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ కావడంతో కాలనీల్లో పెరుగుతున్న జనాభాకు ఈ డ్రైనేజీ పైప్‌లైన్ సరిపోవడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి తమ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి.

\- కె.కృష్ణారెడ్డి, ఎన్జీవోస్‌కాలనీ

మాదక ద్రవ్యాలకు నో చెప్పండి

● జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ అండ్ ఇల్లిక్ట్ ట్రాఫికింగ్ డేను పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1987 నుంచి ప్రతి సంవత్సరం జూన్ 26న మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక రోజును జరుపుకుంటున్నారని చెప్పారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. కుటుంబ సభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయి. ఆర్థిక ఇబ్బందులు మొదలవుతాయన్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోయి అసలేమి నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారన్నారు. మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడే వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా లీగల్ కేర్ సపోర్ట్ సెంటర్‌ను న్యాయమూర్తి ప్రారంభించారు. మాదక ద్రవ్యాల కేసులలో బెయిల్ ఇచ్చాక వారు మూడు రోజుల పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో కౌన్సిలింగ్‌కి హాజరు కావాలన్నారు. లీగల్ కేర్ సపోర్ట్ సెంటర్ సేవలను అందరూ సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి, ప్రముఖ వైద్యులు నివేదిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు సురేందర్, గంగ కిశోర్, రవి, శ్రీధర్, లీగల్ కేర్ సపోర్ట్ సెంటర్ కౌన్సిలర్లు శ్యామలదేవి, అమితరాణి, జ్యోతిరావు, అనిత, ఉదయరాణి పాల్గొన్నారు.

రూ.5,050 కోట్ల రుణాలు అందిస్తాం: సత్తయ్య


మాట్లాడుతున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

హయత్‌నగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జనరల్ బాడి సమావేశం బుధవారం తుర్కయంజాల్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో టెస్కాబ్ వైస్ చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2023- 2024 ఆడిట్‌ను సభలో ఆమోదించారు. కొత్తగా రూ.121కోట్లను సహకార సంఘాల రైతులకు అందించేందుకు తీర్మానం చేశారు. అనంతరం కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ 50శాతం వసూలు సాధించిన సంఘాలకు రుణాలు అందిస్తామన్నారు. అందులో భాగంగా రూ.111 కోట్లు ఎల్‌టీ టర్మ్‌లోన్స్ రూ. 20కోట్లు పంట రుణాలు అందిస్తామన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 46వేల మంది రైతులకు గాను సుమారు రూ.300కోట్లు రుణమాఫీ జరగనుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టులో రుణమాఫీ చేస్తారని స్పష్టం చేశారు. రుణమాఫీ పూర్తి అయిన తర్వాత డీసీసీబీ ద్వారా మళ్లీ రైతులకు సుమారు రూ.5,050కోట్లు కొత్త రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో భాస్కర సుబ్రహ్మణ్యం, డైరక్టర్లు రవీందర్‌గౌడ్, అంజిరెడ్డి, చంద్రశేఖర్, సతీష్, ప్రవీన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సైదా, పీజీవీ రాణి, సిబ్బంది గిరిధర్, సొసైటి చైర్మన్లు, సెక్రెటరీలు పాల్గొన్నారు.


ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ ప్రతినిధులు భీమేశ్ తదితరులు

డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించాలి

సరూర్‌నగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వాడకం కలిగే దుష్పరిణామాలపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) ప్రతినిధులు మీర్‌పేట్ పోలీసులను కోరారు. ఈ మేరకు బుధవారం సంఘం బాలాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లూర్ భీమేశ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి ఇన్‌స్పెక్టర్ నాగరాజు స్పందిస్తూ డ్రగ్స్ క్రయవిక్రయాలపై ప్రత్యేక నిఘా పెడతామని, త్వరలో అవగాహన సమావేశాలు సైతం ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ ప్రతినిధులు నక్కరమోని నాగరాజు, పగిడిమర్రి నరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మలక్‌పేటకు మంత్రి సీతక్క

ఓల్డ్ మలక్‌పేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల కోసం కృషి చేసిన హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్‌లో గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అనంతరం హెలెన్ కెల్లర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే బలాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం: యువకుడి అరెస్ట్

కొత్తపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం చేసిన యువకుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు.. పోలీసుల కథనం ప్రకారం.. వారుంటున్న ఇంటి కాంపౌండ్‌లోనే మరో ఇంట్లో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికుడు కట్లెల శ్రీకాంత్(27) కూడా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం చిన్నారి బాత్ రూమ్‌లోకి వెళ్లడం శ్రీకాంత్ గమనించాడు. అతడు కూడా బాత్‌రూమ్‌లోకి వెళ్లి చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. పసిపాప గట్టిగా ఏడ్వడంతో తల్లి బాత్‌రూమ్ వద్దకు వెళ్లింది. అతడు ఆమెను తోసేసి బయటకు పరుగు తీశాడు. తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



బహుమతులను అందజేస్తున్న డిపో మేనేజర్ హరి

చాదర్‌ఘాట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. డిపో మేనేజర్ హరి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉద్యోగులు, వారి పిల్లల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిత్యం విధుల్లో బిజీబిజీగా ఉద్యోగులు, ఉద్యోగంతో అందుబాటులో లేని తల్లిదండ్రుల పిల్లలు ఈ కార్యక్రమాలతో కొంత వరకు ఆనందంతో ఉపశమనం పొందగలిగారని డిపో మేనేజర్ హరి అన్నారు. ఉద్యోగులు ఒత్తిడిని అధిగమిస్తూ సిబ్బంది సమష్టి కృషితో యాజమాన్యం ఇచ్చిన లక్ష లక్ష్యంను సాధించేందుకు రూ.10వేలు అదనంగా సంపాదించేందుకు ఇలాంటి స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం: ఝాన్సీ

చాదర్‌ఘాట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల అక్రమ ఫీజుల వసూళ్లను అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైందని రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. బుధవారం పాఠశాలల బంద్‌ను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న తరగతులను ర్యాలీగా వెళ్లి బహిష్కరించారు. ఈ సందర్భంగా బంద్‌కు సహకరించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అక్వారి మహేష్, జిల్లా కన్వీనర్ హనుమాన్‌చారి, కార్యవర్గసభ్యులు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఐక్యవేదిక సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యకారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఉద్యమకారుల సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని, ఉద్యమకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ఒక వేదికను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు అంతటి ధనుంజయగౌడ్, గుర్జని వెంకటేశ్‌గౌడ్, బుర్ర జంగంగౌడ్, కూతాటి సుధాకర్, నంజాటి కృష్ణగౌడ్, దేవేందర్, జంగయ్య, గుండె రవీందర్, కృష్ణ, అలుగుబెల్లి కృష్ణ, జంగయ్య, కృష్ణకుమార్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో

నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అస్యభంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జైలు, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని అత్యాచారం, పోక్సోకోర్టు న్యాయమూర్తి తీర్పుచెప్పారు. స్పెషల్ పీపీ సునీత బర్ల కథనం ప్రకారం నాగోల్‌కు చెందిన టీ. సాయికుమార్(19) అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన ఒక బాలికను ప్రేమపేరుతో వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాధితురాలి తల్లి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో సహా కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి ఎం కే పద్మావతి నిందితుడికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రోడ్డు పనుల్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని కోదండరామ్‌నగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేశ్వర్లు, కరీం, రఘునందన్‌జోషి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాబాద్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

సైదాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ఇటీవల వరుస హత్యలు, డ్రగ్స్, గంజాయి అమ్మకాల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణికాలనీ పరిసర ప్రాంతాలలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. రాత్రి వేళలలో రోడ్లపై తిరుగుతున్న యువకులను ఆపి క్షుణ్ణంగా పరిశీలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలు తనిఖీ చేశారు. సరైన సమాధానం చెప్పని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వరుసగా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతుంటాయని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపారు.

టీజీపీఎస్‌సీ పరీక్షకు 198 మంది అభ్యర్థులు హాజరు

కొత్తపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూ నాగోల్‌లో సీఐఓఎస్ డిజిటల్ ప్రై.లి.లో బుధవారం ఆన్‌లైన్ టీజీపీఎస్‌సీ పరీక్షకు 198మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185 మంది అభ్యర్థులకు గాను 99 మంది హాజరు కాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో కూడా 185 మందికి గాను 99 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 86మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లోనూ 86 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం

ఎల్బీనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లో బొడ్రాయి పునఃప్రతిష్ఠ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు బొడ్రాయిని దర్శించుకుని బోనం సమర్పించారు. సరూర్‌నగర్‌లోని అన్ని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రప్రకారం మేకపోతులను అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజల్లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, మాజీ కార్పొరేటర్ అనితదయాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు సాతెల్లి రాధనాగరాజు, స్వరూప, రమేష్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, కాంగ్రెస్ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, బేర బాలకిషన్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, అంజయ్య, సిల్వేరి భిక్షపతి, ముఖేష్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.


కనుల పండువగా సత్యనారాయణస్వామి కల్యాణం

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): లలితానగర్‌లో గడ్డిఅన్నవర క్షేత్ర వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పూర నర్సింహగుప్తా, మాజీ చైర్మన్ చిదర రమేష్ కార్పొరేటర్‌కు స్వామి వారి జ్ఞాపికను అందజేసి, సత్కరించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ పాల్తి శ్రీనివాస్, మాజీ చైర్మన్ వక్కలంక శ్రీనివాస్‌రావు, కిషన్, అశోక్‌గుప్తా, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, రఘునందన్ జోషి, టింకు పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి

వనస్థలిపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): శివుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోల్ డివిజన్ జైపూరి కాలనీలోని శివ పంచాయతన కాశీ విశ్వేశ్వరాలయంలో బుధవారం జరిగిన సప్తమ వార్షికోత్సవాలకు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉప్పల సాయితేజ, ఉప్పల సాయికిరణ్, రాజిరెడ్డి, చిరంజీవి, కాలనీ అధ్యక్షుడు యాదగిరి, రమేష్, మాధవి, మమత, ప్రసన్న, మీన పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మహేశ్వరం ప్రధాన కార్యదర్శిగా లింగసిద్ధార్థ


లింగసిద్ధార్థకు నియామక పత్రం ఇస్తున్న రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా ఆకులమైలారం గ్రామానికి చెందిన అచ్చన లింగసిద్ధార్థ నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. నాయకులు అండేకార్ సురేందర్‌జీ, అల్లం శ్రీకాంత్, లాడే మహేశ్, అచ్చన శ్రీనివాస్, రావుల సత్యం, మహేశ్, సాయి, ప్రవీణ్, మల్లేశ్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ నాటి చీకటి రోజులను మరిచిపోలేం

సైదాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారతదేశంలో ఎమర్జెన్సీ చీకటి రోజులను జీవితంలో మరిచిపోలేమని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్‌జీ అన్నారు. మంగళవారం రాత్రి ఎస్‌బీహెచ్ సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్యం చీకటి రోజు అనే అంశంపై భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఎమర్జెన్సీలో ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతు నొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన నేతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, కార్పొరేటర్లు జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గజానంద్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వినోద్‌గౌడ్, రమణ్‌సింగ్ పాల్గొన్నారు.